



ఒక చిత్రం ఆంధ్రదేశాన్ని వందరోజుల్నుంచి పాడేస్తోంది. ఇంకా పాడేస్తే జనం భయపడిపోతారని, సదరు నిర్మాతలు ఆ చిత్రానికి నూరురోజులు నింపేస్తున్నారు. ఆ చిత్రానికి సగటున రోజుకి లక్షన్నర కలెక్షన్. వందరోజుల్లో కోటిన్నర వసూళ్ళు. ప్రభుత్వం నాడు షికారుకొచ్చినట్టు వచ్చి అందులో సగం గద్దల్లా ఎత్తుకుపోయారు. మిగతా సగంలో సగం థియేటర్ వారు తినేశారు. మిగిలిందాంట్లో పంపిణీదారుడు పెట్టిన డబ్బు ప్లస్ కమిషన్ లాక్కున్నాడు. సదరు నిర్మాత ఈ దోపిడీకి ఏడవలేదు. మిగతా నిర్మాతలు మాత్రం చాలా చాలా ఏడ్చేశారు. ఆ ఏడుపు కసితో అలాంటి చిత్రాన్నే నిర్మించడానికి కథల కొంతల్ని కట్టుకుంటున్నారు.

ఆ చిత్రంలో చాలామంది నటీనటులు నటించారు. ఒకానొకప్పుడు మహోజ్జ్వల తారగా వెలిగి, ప్రస్తుతం మృత తార అయిన తారా నటించింది. ప్రస్తుతంలో వెలిగిపోతున్న ధ్రువతారలూ నటించారు. మహోజ్జ్వలంగా వెలగడానికి, ఉరుకులు పరుగుల మీద వచ్చేస్తున్న తారలూ ఉన్నారు. ఆ మహోజ్జ్వల తారాపథంనించి మెల్లగా జారిపోతూ ఉన్న జారుడు తారలూ ఉన్నారు. వెలిగేందుకు మొదటి మెట్టెక్కిన కొత్తతారలూ ఉన్నారు. వాళ్ళందరూ ఈ వందరోజుల ఉత్సవానికి వస్తున్నారు. ఆ చిత్రంలో నటించే ఖాళీ లేక, మిగిలిపోయిన తార

**ఎన్. ఆర్. నంది**

ప్రారంభోత్సవం చేస్తోంది. అలానే మరో మిగిలిపోయిన తార ఉపన్యాసం ఇచ్చేందుకు వస్తోంది. అలానే మిగిలిపోయిన మరో మహోజ్జ్వల తార బహుమతులు అందచెయ్యడానికి వస్తోంది. మరో మహోన్నత తార రన్నింగ్ కామెంట్రీకి వస్తోంది. ఇంకా మిగిలిపోయిన పాతతారలూ, శోకతారలూ, కోకతారలూ, గీత తారలూ, సంగీత తారలూ, ఛాయాతారలూ, ఆటతారలూ, మాటల తారలూ, కథా తారలూ, కూర్పు తారలూ, దర్శక, నిర్మాతతారలూ వస్తున్నారు. వాళ్ళొస్తున్నారని జనానికి ఎప్పుడో రెండోవారంలోనే తెలిసిపోయింది. వాళ్ళొచ్చిన రోజున హోటల్ పూర్తిగా నిండిపోయింది. రోడ్లు జనంతో నిండిపోయాయి. [illegible]

